క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు అభినందనలు



ప్రకాష్‌ను సత్కరిస్తున్న దస్తావేజు లేఖర్లు

మలికిపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నల్లి ప్రకాష్‌ను మలికిపురం దస్తావేజు లేఖర్లు గురువారం సత్కరించారు. అనంతరం ప్రకాష్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లేఖర్లు నేదునూరి సత్తిబాబు, పాలగుమ్మి శంకరం, మంచికంటి కిట్టు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



అప్పనపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ మంగాలక్ష్మి

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని సర్పంచ్‌లు అడబాల తాతకాపు, గెడ్డం మంగాలక్ష్మి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా లూటుకుర్రు, అప్పనపల్లి, పాశర్లపూడి లంక గ్రామాల్లో గురువారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లను నరికి వేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడేపల్లి చిన్న, బత్తుల జనార్ధనరావు, పాటి గోవిందు, కోలా రాంబాబు, ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సభలను వినియోగించుకోవాలి

ఆలమూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) పనుల నిర్వహణపై మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం నిర్వహించే సభలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ కె.జాన్ లింకన్ కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయ పది గంటల నుంచి సాయంకాలం ఐదు గంటల వరకూ ఈ గ్రామ సభలు నిర్వహించనున్నామన్నారు. నిర్దేశించిన సమయానికి ఆయా గ్రామ పంచాయతీల వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జాబ్‌కార్డుదారులు హాజరుకావాలన్నారు. గ్రామ సభ ఆమోదించిన పనులను సత్వరమే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్‌కేపురం సినిమా ప్రీరిలీజ్ వేడుక



ప్రీరిలీజ్ వేడుకలో మాట్లాడుతున్న హీరో రవికిరణ్

మలికిపురం: గుబ్బల రవి కిరణ్ ప్రధాన పాత్రలో రూపొందించిన ఆర్‌కేపురం సినిమా ప్రీరిలీజ్ వేడుక గురువారం మలికిపురంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రీమియర్ షో వేశారు. అనంతరం హీరో గుబ్బల రవికిరణ్ మాట్లాడుతూ సినిమా అద్భుతంగా ఉంటుందని, అందరినీ అలరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాపాక రమేష్‌బాబు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, గెద్దాడ నాగేశ్వరరావు, మిఠాయి కొట్టు అంజయ్య, రావూరి నాగు, తాడి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక

పి.గన్నవరం: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులు, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై జరిగిన సామాజిక తనిఖీపై ఈ నెల 24వ తేదీన పి.గన్నవరంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి పథకం వేతన దారులు, మేట్‌లు, సిబ్బంది పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రవీంద్రనాథ్ చిరస్మరణీయుడు

అంబాజీపేట: బ్యాంకింగ్ రంగంలో ఉన్నత ఉద్యోగిగా సేవలందించిన నేలపూడి రవీంద్రనాథ్ ఠాగూర్ చిరస్మరణీయుడని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు సోదరుడు, ఇండియన్ బ్యాంక్ పూర్వపు సీనియర్ మేనేజర్ రవీంద్రనాథ్ ఠాగూర్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కోట సత్తిబాబు, పాలమూరి వెంకట్, స్థానిక వార్డు సభ్యులు గోసంగి సత్యనారాయణ, సాధనాల బాలకృష్ణ, ఇసుకపట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదుకు వేళాయె

- పొలాల బాట పట్టిన వ్యవసాయాధికారులు
- నమోదుతో రైతులకు లాభాలెన్నో



పుల్లేటికుర్రులో ఈ పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

అంబాజీపేట: ఈ-పంట నమోదుకు సమయం ఆసన్నమైంది. విత్తనాల ఎంపిక నుంచి పండించిన పంట మార్కెట్‌కు తరలించే వరకూ అన్నదాతలకు అవసరమైన అన్ని రకాల సేవలు, సహాయం రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు ఏర్పడిన సమయంలో రైతులను ఆదుకునేందుకు గత ప్రభుత్వంలో ఈ-క్రాప్ పేరిట ఈ విధానం ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఈ-పంటగా పేరును మార్చారు. ఈ విధానంలో రైతులు ఏ విధమైన పంట, ఎంత విస్తీర్ణంలో పండించారో స్పష్టంగా నమోదు చేస్తారు. ఈ-పంట నమోదు కోసం ప్రస్తుతం వ్యవసాయాధికారులు పొలాల బాట పట్టారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి ఈ-పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు.

సమస్త వివరాలు యాప్‌లో నిక్షిప్తం

పి.గన్నవరం నియోజకవర్గంలో 25,382 ఎకరాల్లో, కొత్తపేట నియోజకవర్గంలో 34,702 ఎకరాల్లో, రాజోలు నియోజకవర్గంలో 8,650 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ-పంట నమోదు విధానంలో రైతులు తాము సాగు చేసే భూమిలో వరితో, కొబ్బరి, కోకో, అంతర పంటలు ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నీ యాప్‌లో నమోదు చేయించుకోవాలి. ఉద్యోగులు పూర్తవ్వగానే ఆధార్, పంట రకం, విత్తిన తేదీ వివరాలను కొత్త యాప్‌లో నమోదు చేస్తారు. అనంతరం యాప్‌లో నమోదు చేసిన ప్రతి సర్వే నెంబర్ దగ్గరకు వెళ్లి జియో కోఆర్డినేట్స్ ద్వారా ఫొటో తీస్తారు. ఈ విధంగా రైతులు పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే సబ్సిడీలు అందుతాయి.

రైతులకు అందే ప్రయోజనాలివే

రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయించుకోవడం వల్ల పంటల బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్ల మంజూరు వంటి ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉంటుంది. ఈ పంటలో భాగంగా రైతు సేవా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతి రైతు భూమి, గ్రామం, సర్వే నెంబరు, ఆధార్, పంట వివరం, నాట్లు వేసిన తేదీ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు. దీంతో పంట అమ్ముకునే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం అవుతుంది.

వేగవంతంగా పంట నమోదు



ఈ పంట నమోదు వేగవంతం చేశాం. ఈ నెలాఖరు నాటికి పూర్తయ్యే అవకాశముంది. సెప్టెంబర్ 20వ తేదీలోపు ఈ పంట నమోదు పూర్తి చేయాల్సి ఉంది. విత్తు నుంచి విక్రయం వరకూ మేలు చేసే ఈ పంట నమోదును రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, అంబాజీపేట

నమోదుతో రైతులకు ప్రయోజనం



ఈ-పంట నమోదు కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు అందుతుంది. ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతిన్నా రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా నష్ట పరిహారం నేరుగా రైతు ఖాతాలో జమవుతుంది.

– దొమ్మేటి రాధాసూర్యనారాయణ, రైతు, ఇరుసుమండ

పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి



వ్యాఘ్రేశ్వరంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

అంబాజీపేట: ఖరీఫ్ పంట తొలి దశలో కాండం తొలుచు పురుగు(మండి పురుగు), ఆకు నల్ల, ఆకుముడత పురుగుల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ రైతులకు సూచించారు. ఇరుసుమండలో రైతు సేవా కేంద్రం వద్ద ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన రైతు విత్తనోత్పత్తి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వరిలో విత్తనోత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో రైతు క్షేత్రాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కాండం తొలుచు పురుగు ఆశించిన వరి దుబ్బులోని పిలకలో మొవ్వ ఆకు చనిపోతుందన్నారు. దీని నివారణకు క్లోరాంట్రనిల్‌ప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా కార్బోఫ్యూరన్ 3G గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున వేసుకోవాలన్నారు. ఆకునల్లి ఆశిస్తే దాని నివారణకు నీటిలో కరిగే గంధకం 50 శాతం పొడిని 3 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకు ముడత నివారణకు క్లోరిపైరాఫాస్ 20 ఈడీ 2.5 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ప్రకృతి వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి

రాజోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు: గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గురువారం రాజోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, అవినీతి ఆరోపణలున్న ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణం దృష్ట్యా గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి సారించాలన్నారు. తాగునీరు సక్రమంగా అందించాలన్నారు. గ్రామాల్లోని పలు సమస్యలపై పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యే వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, మండల ఉపాధ్యక్షులు పాలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ ఎస్.బాలాజీ, తహసీల్దారు ఎస్ఎస్ఎస్ ప్రసాద్, రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం



భారీ వర్షానికి నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న అంబాజీపేట ప్రధాన రహదారి

అంబాజీపేట: అల్పపీడనం కారణంగా అంబాజీపేట మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయాయి చెరువులను తలపించాయి. వర్షం కారణంగా రోడ్లపై చిరు వ్యాపారాలు వెలవెలబోయాయి. స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, అధికారులు, వాహన దారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంబాజీపేట హైస్కూల్ ప్రాంగణం నీట మునిగింది. గత వారం రోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది.

స్త్రీల ఆసుపత్రిని వెల్లూరు ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం



అంబాజీపేట స్త్రీల ఆస్పత్రిని పరిశీలిస్తున్న డాక్టర్ రూప్ సోలోమాన్

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతంలో 58 ఏళ్ల క్రితం స్థాపించి ఎన్నో ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తున్న అంబాజీపేట స్త్రీల ఆసుపత్రిని తమిళనాడులోని వెల్లూరు ఆసుపత్రి తరహాగా తీర్చిదిద్దుతామని తమిళనాడులోని స్కడ్డర్ మెమోరియల్ ఆసుపత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూప్ సోలోమాన్ వెల్లడించారు. అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి 58వ వార్షికోత్సవ వేడుకలు ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఎస్ఆర్‌కే హెవార్డు రాజ్ అధ్యక్షతన గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోలోమాన్ మాట్లాడుతూ తమిళనాడులోని స్కడ్డర్ ఆసుపత్రికి రెండు శతాబ్దాల చరిత్ర, అనుభవం ఉందని, ఎంతో పేరుగాంచిన రాయవెల్లూరు ఆసుపత్రికి మాతృ సంస్థ అని పేర్కొన్నారు. అంబాజీపేటలో ఉన్న స్త్రీల ఆసుపత్రిని మరిన్ని అధునాతన సదుపాయాలతో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా తీర్చిదిద్ది పేద ప్రజలకు మరింతగా సేవలందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య విభాగాలు ప్రారంభించి అధునాతన ల్యాబ్‌లను పరిశీలించారు. ఆసుపత్రి వార్షికోత్సవం సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రావులపాలెంలో కమిటీ కుర్రోళ్ల సందడి



రావులపాలెంలో సందడి చేసిన నిహారిక తదితరులు

రావులపాలెం: స్థానిక అక్షర కాంప్లెక్స్ థియేటర్స్‌లో గురువారం కమిటీ కుర్రోళ్ల టీమ్ సందడి చేసింది. సినీనటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా నిహారిక కొణిదెల చేతుల మీదుగా కేక్ కట్ చేయించి అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో థియేటర్స్ యజమానులు తాడి నాగమోహనరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికోకు న్యాయం కోసం మానవహారం



రావులపాలెం కోనసీమ గేటు వద్ద మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

రావులపాలెం: కలకత్తాలో మెడికోపై జరిగిన దుశ్చర్యలో న్యాయం చేయాలంటూ విద్యార్థి, ప్రజా సంఘాలు, మానవతా వాదుల ఆధ్వర్యంలో గురువారం మానవహారం చేపట్టారు. మృతురాలికి న్యాయం చేయాలని శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోనసీమ గేటు వద్ద మానవహారం నిర్వహించి, హత్యాచారాలను ఆపాలని, మృతురాలికి న్యాయం చేయాలంటూ అరచేతి ముద్రలను వేస్తూ క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది విద్యార్థినులు, ఉమెన్ యాక్టివిస్టులు మాట్లాడుతూ కోల్‌కతాలో మెడికోను అతికిరాతకంగా హింసించి, హతమార్చడం విచారకరమన్నారు. దేశంలో మహిళలపై హత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని, స్త్రీకి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పారా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ థామస్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాస్, పోతుమూడి శేషారత్నం, ఎస్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పంగల యానిమేటర్‌పై విచారణ

తాళ్లరేవు: మండల పరిధిలోని ఉప్పంగల యానిమేటర్(వీఓఏ) కేసనకుర్తి భానుకుమారి అవినీతిపై గురువారం మండల ఏపీఎం రెడ్డి సన్యాసిరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ రఘురాంలు విచారణ నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా పొందిన రుణాలకు సంబంధించి డ్వాక్రా సంఘాల మహిళల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయడంతో పాటు పొదుపు డబ్బులను సొంతానికి వాడుకున్నారని గ్రూపు సభ్యులు ఈ నెల 19వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రుణ దరఖాస్తుకు రూ.500, రుణం మంజూరైన తరువాత లక్షకు రూ.3,000 చొప్పున యానిమేటర్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా తంగేటిపంపు గ్రామానికి చెందిన శ్రీఆంజనేయ డ్వాక్రా సంఘం గ్రూపు వద్ద రూ.7 వేలు, అలాగే శ్రీసాయిశక్తి డ్వాక్రా సంఘం గ్రూపు వద్ద రుణమాఫీ నగదు తీసుకునేందుకుగానూ రూ.10 వేలు అక్రమంగా వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగి బెదిరింపులకు పాల్పడుతుందని, ఈ అక్రమ వసూళ్లపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించామని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని ఏపీఎం సన్యాసిరావు తెలిపారు.

కొత్తపేటలో కొవ్వొత్తుల ప్రదర్శన



కొత్తపేట డిగ్రీ కళాశాలలో విద్యార్థుల కొవ్వొత్తుల ప్రదర్శన

కొత్తపేట: కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కళాశాల మహిళా సాధికారత, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో సేవాభావంతో పనిచేసే వైద్యులపై ఇలాంటి ఘటనలు దురదృష్టకరమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. అనంతరం హత్యకు గురైన డాక్టర్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, కళాశాల మహిళా సాధికారత కన్వీనర్ సీహెచ్ నాగరాణి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు, అధ్యాపకులు సీహెచ్ నాగలక్ష్మి, అరుణసుందరి, హేమలత, దీపికాదేవి, ప్రసన్నజ్యోతి, భవాని, నాగజ్యోతి, సాయిలక్ష్మి, సూపరింటెండెంట్ భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో రక్తదాన శిబిరం



అప్పనపల్లిలో రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

మామిడికుదురు: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు చిరంజీవి సేవా సమితి సభ్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా చిరంజీవి సేవా సమితి అధ్యక్షులు గుండాబత్తుల తాతాజీ, సర్పంచ్‌లు గెడ్డం మంగాలక్ష్మి, అడబాల తాతకాపు, సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, వీధి సత్తిబాబు, తులా ఉమ, కంకిపాటి నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

చాకలిపాలెంలో రక్తదాన శిబిరం

పి.గన్నవరం: మండలంలోని చాకలిపాలెం గ్రామంలో చిరు పవన్ సేవాసమితి అధ్యక్షుడు కందాల చంటి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు చంటి సమకూర్చిన విద్యా సామగ్రిని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం పి.గన్నవరం సెంటర్లో రిక్షా కార్మికులకు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, గనిశెట్టి నాగలక్ష్మి, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, సత్తిబాబు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రాజోలు: సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అరవపాలెం చిరంజీవి సేవాసమితి ఆధ్వర్యంలో కడలి పంచాయతీ స్వీపర్లకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు, సూరిశెట్టి శ్రీనివాస్, గుండాబత్తుల తాతాజీ, వులిశెట్టి లక్ష్మణరావు పాల్గొన్నారు.

బస్టాండ్ ఖాళీ స్థలం లీజుకు టెండర్లు

అంబాజీపేట: అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న 2,730 గజాల(0.56 ఎకరాల) ఖాళీ స్థలాన్ని 15 ఏళ్ల కాలానికి అద్దె ప్రాతిపదికన లీజుకు ఇవ్వటానికి టెండర్లు పిలుస్తున్నట్లు అమలాపురం ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ఎస్ఎన్ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారం ఆర్టీసీ వెబ్‌సైట్ నుంచి వచ్చే నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలు 13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు ఈడీ విజయవాడ జోన్-2 ఆఫీస్ నందు ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరుస్తారన్నారు. ఆసక్తి గల ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అమలాపురం డిపో మేనేజర్ మూర్తి కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పి.గన్నవరం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని నాగుల్లంక ఫీడర్‌కు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ ఆనందరాజు గురువారం తెలిపారు. నాగుల్లంక ఫీడర్ పరిధిలోని ఎల్.గన్నవరం, మొండెపులంక, పెదకందాలపాలెం, నాగుల్లంక, చాకలిపాలెం, వాడ్రేవుపల్లి, మానేపల్లి, రాయిలంక, పుచ్చల్లంక, కనకాయలంక గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

మలికిపురం: విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మలికిపురం, లక్కవరం గొల్లపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ గురువారం తెలిపారు.

ఆలమూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.

కొబ్బరి కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

కొత్తపేట: కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర కొబ్బరి కార్మికుల సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ కొబ్బరి దింపు, ఒలుపు, నాడెం, మోత, తరుగుడు, పీచు, తాళ్లు, ఎగుమతి, దిగుమతిపై ఆధారపడి వేల మంది జీవనం సాగిస్తున్నారన్నారు. వారి సంక్షేమం కోసం ప్రత్యేక కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

వైభవంగా కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు కాళ్లకూరి కాశీ శేఖర్‌బాబుశర్మ మంత్రోచ్ఛరణల నడుమ శైవాగమ పద్ధతిలో ఆలయ పురోహితుల బృందం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను జరిపించింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోసం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ దంగేటి చంద్రకళ, మాజీ సర్పంచ్ మెర్ల గోపాలస్వామి, జాంప్రోలు నాగేశ్వరావు, సుంకర కామరాజు, బండారు సంజీవ్, వంటిపల్లి పాపారావు తదిదరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు బియ్యం అందజేత



పాశర్లపూడిలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలో గోదావరి వరద ముంపు బాధితులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు బాధితులకు గతంలోనే బియ్యం, ఆయిల్, పప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అందించామన్నారు. బాధితుల్లో మిగిలిన వారిని కూడా గుర్తించి వారికి కూడా సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, జాలెం శ్రీనివాసరాజు, చుట్టుగుళ్ల కిశోర్, కొల్లు ఏడుకొండలు, మంద గాంధీ తదితరులు పాల్గొన్నారు.